క్లుప్తంగా

కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



క్రిష్ణదొడ్డి కొండపై వేంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

సి.బెళగల్: మండలంలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోనా వెంకటేశ్వర స్వామి వారికి శనివారం పూజారులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. శనివారం స్వామి వారికి కొండపై ఆలయంలోని భూదేవి, అలివేలిమంగమ్మ సమేత వేంకటేశ్వర స్వామి మూలమూర్తులకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించారు. స్థానికులతో పాటు, సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పులకుర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు తరలిచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.

సంచార చికిత్స కేంద్రం తనిఖీ



గర్భిణులకు ఆరోగ్య సూచనలిస్తున్న జిల్లా నోడల్ అధికారి రఘు

కర్నూలు(రూరల్): మండలంలో ఈ.తాండ్రపాడు పీహెచ్‌సీ పరిధిలో నిడ్జూరు గ్రామంలో శనివారం సంచార చికిత్స నిర్వహించారు. కార్యక్రమాన్ని జిల్లా నోడల్ అధికారి రఘు తనిఖీ చేశారు. అనంతరం వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులతో మాట్లడి వారికి పలు సలహాలిచ్చారు. వైద్యులు డాక్టరు రేష్మ ,ఆరోగ్య కార్యకర్త సర్వసతి పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్లపై విచారణ



పోలకల్ సచివాలయంలో పింఛన్లపై విచారణ చేస్తున్న ఎంపీడీఓ రాణెమ్మ

సి.బెళగల్: మండలంలోని పోలకల్ గ్రామంలో దివ్యాంగ పింఛన్లపై ఎంపీడీఓ రాణెమ్మ విచారణ చేశారు. శనివారం ఆమె గ్రామ సచివాలయం- 2కు చేరుకుని గ్రామంలో దివ్యాంగుల పింఛన్ పొందుతున్న 31 మంది లబ్ధిదారులను విచారించారు. కాగా దివ్యాంగ పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులను ఈనెలలో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో తనిఖీ చేయనుండటంతో ముందస్తుగా ఎంపీడీఓ వారిని విచారించి, వివరాలను నమోదు చేసుకున్నారు. అలాగే సచివాలయ ఉద్యోగులతో సర్వే పనులు, పీజీఆర్ఎస్‌పై సమీక్ష సమావేశం నిర్వహించి, ఉద్యోగులకు పలు సూచనలు చేశారు.

ఈ-శ్రమ్ కార్డుతో ప్రయోజనం



ఈశ్రమ్ కార్డు గురించి వివరిస్తున్న అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శ్రీలక్ష్మి

కల్లూరు: మండల పరిధిలని నెరవాడ గ్రామంలో ఉపాధి కూలీలకు ఈ-శ్రమ్ కార్డు ఆవశ్యకతపై అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శ్రీలక్ష్మి అవగాహన కల్పించారు. ఈ శ్రమ్ కార్డులు పొందిన వారికి ప్రభుత్వం అందించే అన్ని రకాల సామాజిక భద్రతా పథకాలు, వివిధ సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. 16 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాలలోపు వయస్సు గలవారు ఈ శ్రమ్ కార్డులు పొందడానికి అర్హులన్నారు. కార్మికులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు హేమంత్, రాజేశ్వరి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

కర్నూలు (సెంట్రల్) : కర్నూలు పార్లమెంటు పరిధిలోని డీఎస్సీ- 2025 సెకండరీ గ్రేడ్ టీచర్ అభ్యర్థులకు వైఈఎస్ పబ్లికేషన్ ద్వారా యూట్యూబ్‌లో ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీ బస్తిపాటి నాగరాజు తెలిపారు. యువజన సంక్షేమ జిల్లా విద్యా శాఖ సహకారంతో నిర్వహిస్తున్న ఈ ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ పి.రంజిత్ బాషాతో కలసి ఎంపీ ఆవిష్కరించారు. ఆన్‌లైన్ శిక్షణ కోసం 92922 07601 అనే నంబర్‌కు వాట్సాప్ ద్వారా తమ పేరు, అడ్రస్ వివరాలను తెలుపుతూ ఆధార్ కార్డు డీఈడీ సర్టిఫికెట్ కాపీలను ఈ నెల7 లోపు పంపి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ అయిన అభ్యర్థులకు డీఎస్సీ ఎస్‌జీటీ సిలబస్‌కు సంబంధించి న పా ఠాలు, ప్రశ్నాపత్రాలు యూట్యూబ్ ద్వారా అందుబా టులోకి వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ శామ్యూల్ పాల్, సెట్కూరు సీఈఓ వేణుగోపాల్, ఎంప్లాయ్‌మెంట్ అధికారి సోమశివారెడ్డి పాల్గొన్నారు.

సేవాభావంతో పనిచేస్తే గుర్తింపు

- ఎన్‌టీఆర్ హెల్త్ వర్సిటీ వీసీ సన్మాన కార్యక్రమంలో కలెక్టర్



డాక్టర్ పి.చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, కేఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): సేవాభావంతో పనిచేసే వారికి ఎప్పటికీ గుర్తింపు ఉంటుందని జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా చెప్పారు. ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా నియమితులైన డాక్టర్ పి. చంద్రశేఖర్ మొదటిసారిగా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అయనను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కార్డియాలజి విభాగపు అభివృద్ధిలో డాక్టర్ పి.చంద్రశేఖర్ పాత్ర కీలకమన్నారు. ఆయన అందించిన సేవలే నేడు వైస్ చాన్స్‌లర్‌గా చేశాయన్నారు. వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికి చెందిన వ్యక్తి ఈ స్థాయిలో ఉండటం ద్వారా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రితో పాటు మెడికల్ కాలేజీకి మరింత మంచి జరుగుతుందని,అదనంగా సౌకర్యాలు వచ్చే అవకాశం పుష్కలంగా ఉంటాయని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. డాక్టర్ పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ తాను కర్నూలు జిల్లా పర్ల గ్రామానికి చెందిన వాడినని, ఇదే మెడికల్ కాలేజీలో వైద్యవిద్యను అభ్యసించానని గుర్తు చేశారు. వివిధ కోర్సుల అనంతరం కార్డియాలజి విభాగంలో 1997లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరి వివిధ హోదాలలో 25 సంవత్సరాలు సేవలందించి పదవీ విరమణ చేసినట్లు తెలిపారు. తాను రోగులకు అందించిన సేవలను గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు తనకు వీసీ పదవి ఇచ్చారన్నారు. కర్నూలు మెడికల్ కాలేజి, ప్రభుత్వ సర్వజన వైద్యశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ సీతారామయ్య, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, కార్డియాలజి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్ టెక్నాలజీని అందిపుచ్చుకోండి

కర్నూలు (సెంట్రల్): ప్రపంచ వ్యాప్తంగా డ్రోన్ టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతోందని, దీనిని యువత అందిపుచ్చుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శనివారం రవీంద్ర మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో డ్రోన్స్‌కు సంబంధించిన ల్యాబ్‌ను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ట్రిపుల్ ఐటీడీఎం అధ్యాపకులతో స్వాయాన్ కార్యక్రమం ద్వారా నిర్వహిస్తున్న డ్రోన్ టెక్నాలజీ శిక్షణ ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఉన్నతమైన నైపుణ్యాలు పొందాలని సూచించారు. డ్రోన్ టెక్నాలజీలో శిక్షణ పొందిన 480 మంది విద్యార్థినులు ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలన్నారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగంపై అన్నదాతలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం శిక్షణ పొందిన 480 మంది విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రవీంద్ర మహిళా ఇంజనీరింగ్ కళాశాల అధినేత పుల్లయ్య, చైర్మన్ జీవీఎం మోహన్ కుమార్, ప్రిన్సిపాల్ కేతు శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.



విద్యార్థినులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న కలెక్టర్

కష్టపడే వారికి పదవులు

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



కాటసాని రాంభూపాల్‌రెడ్డిని పూలమాలతో సత్కరిస్తున్న హరినాథ్‌రెడ్డి

కల్లూరు: వైఎస్సార్‌సీపీలో కష్టపడే వారికి పదవులు వరిస్తాయని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఇటీవల పార్టీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ సెక్రటరీగా నియమితులైన హరినాథ్‌రెడ్డి శనివారం కాటసానిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పదవులు పొందిన వారందరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఓర్వకల్లు మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా



నిరసన వ్యక్తం చేస్తున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు

కర్నూలు(అర్బన్): కర్నూలు - బళ్లారి రోడ్డులో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రోడ్డును బళ్లారి చౌరస్తా నుంచి పెద్దపాడు వరకు విస్తరించినా, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. శనివారం సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, శివారు కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు బి. అనంత లక్ష్మన్న, ఎంపీ మల్లికార్జున, పి. సూర్యశేఖర్ తదితరులు బళ్లారి రోడ్డులో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు నిర్మించడమే కాక లైట్లు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయలేదన్నారు. మెకానిక్ వృత్తిపై జీవించే ఒక యువకుడు ద్విచక్ర వాహనంపై వెళ్తు ప్రమాదానికి గురై మృతి చెంది నెల రోజులు గడుస్తున్నా అధికారులు ఇంతవరకు స్పందించలేదన్నారు. రూ.10 కోట్లు మంజూరై నాలుగేళ్లు గడుస్తున్నా, ఇంతవరకు డివైడర్ల మధ్యలో మొక్కలు నాటలేదని, విద్యుత్‌లైట్లు ఏర్పాటు చేయలేదన్నారు. ఆర్అండ్‌బీ, నగరపాలక సంస్థ అధికారుల సమన్వయ లోపం కారణంగా నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో కె. భోగేశ్వరరెడ్డి, పీటర్, రాబర్ట్, ముల్లర్, రాముడు, రామన్న, నాగేశ్వరరావు, యూనిష్, సీతారామాంజనేయులు, అన్వర్‌బాషా పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ ముస్లింలకు క్షమాపణలు చెప్పాలి



మాట్లాడుతున్న హాఫీజ్ మహమ్మద్ ఇలియాస్

కర్నూలు(టౌన్): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముస్లింలకు క్షమాపణలు చెప్పాలని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హాఫీజ్ మహమ్మద్ ఇలియాస్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అమరావతి రాజధాని పునః ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం మీడియాతో మాట్లాడుతూ ముస్లింలను ఉగ్రవాదులుగా అభివర్ణించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉంటూ మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా నిరాధార ఆరోపణలు చేయడం ముస్లింల మనోభావాలని దెబ్బతీయడమే అన్నా రు. యావత్తు ముస్లిం సమాజానికి క్షమాపణలు చెప్పాలన్నారు. అలాగే తమపై తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మెడికల్ కాలేజీల్లో పరిశోధనలకు ప్రాధాన్యం

- ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పి.చంద్రశేఖర్

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో పరిశోధనలకే తొలి ప్రాధాన్యత ఇస్తానని ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. శనివారం కర్నూలు మెడికల్ కాలేజీలో హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లు, వైద్యులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కళాశాల విద్యార్థిగా, కార్డియాలజి హెచ్‌ఓడీగా, జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా, కేఎంసీ ప్రిన్సిపాల్‌గా పనిచేసి ఇప్పుడు వీసీ హోదాలో కాలేజీ సందర్శనకు రావడం సంతోషాన్నిచ్చిందన్నారు. వైద్య విద్యార్థులు రీసెర్చ్ కార్యక్రమాల్లో అధికంగా కృషి చేస్తే పేద ప్రజలకు ఆ ఫలితాలు అందుతాయని అన్నారు. తనకు వైద్య విద్యను అందించిన కర్నూలు మెడికల్ కాలేజి అభివృద్ధికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కర్నూలు మెడికల్ కాలేజితో పాటు రాష్ట్రంలోని అన్ని మెడికల్ కాలేజీలను ఒక మోడల్ కాలేజీలుగా తీర్చిదిద్దుతానని ఇందుకోసం వచ్చే మూడు నెలల్లో రాష్ట్రంలోని అన్ని మెడికల్ కాలేజీలను సందర్శిస్తానని తెలిపారు. కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ కళాశాలలో 2,240 మంది విద్యను అభ్యసిస్తున్నారని, కళాశాల హాస్టల్‌లో అదనపు గదుల నిర్మాణ ఆవశ్యకతను ఆమె వివరించారు. కొత్తగా పారామెడికల్ కోర్సులకు దరఖాస్తు చేశామని, వాటికి అనుమతి ఇప్పించాలని కోరారు. ఇందుకు డాక్టర్ పి.చంద్రశేఖర్ సానుకూలంగా స్పందించి ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి త్వరితగతిన పనులు పూర్తి చేస్తానని చెప్పారు. అనంతరం ఆయనను అధికారులు, వైద్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.వెంకటేశ్వర్లు, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ పీఎస్‌కే ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలకు అనువైన సమయం



రైతులతో మాట్లడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి



నందనపల్లెలో మట్టిని సేకరిస్తున్న దృశ్యం

కర్నూలు(రూరల్): భూసార పరీక్షలకు మే నెల అనువైనదని, ఇప్పుడే పరీక్షలకు అవసరమైన మట్టిని సేకరించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి తెలిపారు. మండలంలోని నందనపల్లె గ్రామంలో శనివారం భూసార పరీక్ష- మట్టి నమునా సేకరణ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం మండలంలో రబీ పంట కోతలు ముగిశాయి. వేసవిలో భూములు ఖాళీగా ఉన్నందున భూసార పరీక్షలకు సరైన సమయమన్నారు. ప్రతి మూడేళ్లకు ఒకసారి భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఏ పంట సాగు చేయాలని, ఏఏ మందులు, ఎరువులు వినియోగించుకోవాలో అధికారులు సిఫారసు చేస్తారని చెప్పారు. దీంతో రైతులకు పెట్టుబడి భారం తగ్గి నాణ్యమైన, అధిక దిగుబడులు సాధించేందుకు వీలుంటుందని, అలాగే భూసారం దెబ్బతినదని వివరించారు. మట్టి పరీక్షలు చేయించుకోవాలనుకునే రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ వేదమణి, ఏఓలు అన్నపూర్ణ ,ఇందుమతి, హరిప్రియ రూఫస్ రోనాల్డ్ పాల్గొన్నారు.

మట్టిని సేకరించే పద్ధతులు..

- చౌడు,ఆమ్ల నేలల్లో వేర్వేరుగా మట్టి నమూనాలు సేకరించాలి. 15-30 సెం.మీ లోతులోని మట్టిని తీసుకోవాలి.
- చెత్త చెదారం ఉంటే తొలగించి వీ ఆకారంలో గొయ్యి తీసి ఒకే మందంలో పై నుంచి కింద వరకు పారలుగా మట్టి సేకరించాలి.
- జిగ్‌జాగ్ పద్ధతిలో ఎకారకు 8 నుంచి 10 చోట్ల రెండు కిలోల మట్టిని తీసుకోవాలి. - సేకరించిన మట్టిని గోనె సంచిపై వేసి నీడలో ఆరబెట్టి,మట్టి గడ్డలుంటే చిదిమేయాలి. అనంతరం ఆ మట్టిని నాలుగు భాగలుగా చేసి ఒక్కోభాగం నుంచి కొంత మట్టిని తీసుకొని కిలో మట్టిని తయారుచేసి పరీక్షలకు పంపాలని శిక్షణలో తెలియజేశారు.

క్రైం కార్నర్

రిటైర్డ్ డీఈకి సైబర్‌నేరగాళ్ల టోకరా!

కర్నూలు : కర్నూలు నగరం వెంకటరమణ కాలనీలో నివాసముంటున్న సుధీందర్ రావును సైబర్ కేటుగాళ్లు బోల్తా కొట్టించారు. ఈయన పంచాయతీరాజ్ శాఖలో డీఈగా పనిచేసి 23 ఏళ్ల క్రితం పదవీ విరమణ పొంది ఇంటి దగ్గర ఉంటున్నారు. బజాజ్ అవంతిక గ్రూప్‌లో చేరమని ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో గత సంవత్సరం ఆయన సెల్ ఫోన్‌కు ఓ మెసేజ్ వచ్చింది. దానిని పరిశీలించి నిజమేనని భావించిన డీఈ లింక్ పంపిన వారితో సంప్రదించాడు. ముందుగా రూ.2 లక్షలు తమ ఖాతాకు చెల్లించి ఆ తర్వాత బీఆర్ బ్లాక్స్ మాక్సీ అనే ట్రేడింగ్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోమని ఓ మహిళ సూచించగా అందుకు అంగీకరించి ఇన్‌స్టాల్ చేసుకున్నాడు. తర్వాత యాప్‌లో విడతల వారీగా రూ.54.44 లక్షలు సైబర్ కేటుగాళ్లు చెప్పిన ఖాతాల్లో పెట్టుబడి పెట్టాడు. పెట్టుబడి పెట్టినందుకు ట్రేడింగ్ ఖాతాకు రూ.9.26 కోట్లు జమ అయిందని, అది డ్రా చేసుకోవాలంటే రూ.2 కోట్లు చెల్లించాలని సైబర్ కేటుగాళ్లు నమ్మబలికారు. అయితే తెలిసినవారిని సంప్రదించి మోసపోయినట్లు గ్రహించిన సుధీందర్ రావు మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

6న బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 6 వ తేదీ స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో సబ్ జూనియర్ బాల బాలికల విభాగంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం ప్రతినిధి దాదాబాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికయిన క్రీడాకారులు ఈనెల 15 నుంచి 18 వరకు చిత్తూరు జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.జనవరి 1 వ తేదీ 2012 సంవత్సరం తరువాత జన్మించి, పోటీల్లో పాల్గొనాలనే ఆసక్తి ఉంటే తమ జనన ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 9985161007 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పోటాపోటీగా ఎద్దుల బండలాగుడు పోటీలు

- బండలాగుడు పోటీ విజేత బి.తాండ్రపాడు వృషభాలు



బండలాగుతున్న వృషభాలు

కోడుమూరు రూరల్: మండలంలోని పులకుర్తిలో గ్రామంలో శ్రీసాయినాథుడి రథోత్సవ వేడుకలను పురస్కరించుకొని శనివారం గ్రామపెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన పాలపండ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు పోటాపోటీగా జరిగాయి. పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన 12జతల ఎద్దులు పోటీ పడగా, కర్నూలు మండలం బి.తాండ్రపాడు వరలక్ష్మి వృషభాలు విజేతగా నిలిచాయి. కోడుమూరు మండలం వెంకటగిరి బీఎల్‌కే వృషభాలు రెండో స్థానంలో నిలవగా, వీడుగోను పల్లె, నల్లరెడ్డి వృషభాలు మూడో స్థానంలో, మిడుతూరు, ఉత్తనూరు వృషభాలు నాల్గో స్థానంలో, దండురైడర్స్ వృషభాలు 5వస్థానంలో నిలిచాయి. గెలుపొందిన వృషభాల యజమానులకు రూ.30వేలు, రూ.25వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేల చొప్పున దాతల సహకారంతో నిర్వాహకులు అందజేశారు. గ్రామపెద్దలు శ్రీనాథ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రంగారెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

నాటుసారా స్థావరంపై ఎక్సైజ్ దాడులు



తనిఖీలో పట్టుబడిన సారా బాటిళ్లు, బిందెలను సీజ్ చేసిన ఎక్సైజ్ పోలీసులు

కర్నూలు: స్థానిక బంగారుపేట శివారులోని కేసీ కెనాల్ గట్టుపైనున్న నాటు సారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజశేఖర్ గౌడ్, ఈఎస్‌టీఎఫ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, సీఐ చంద్రహాస్, ఎస్ఐలు రెహానా, రవితేజ, సిబ్బంది చంద్రపాల్, రామలింగయ్య, మధు, లక్ష్మీబాయి, సువర్ణమ్మ, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసగౌడు తదితరులు బృందాలుగా ఏర్పడి శనివారం నాటుసారా స్థావరంపై దాడి చేసి బట్టీలను ధ్వంసం చేశారు. దాదాపు 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 120 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. బంగారుపేటలో సారా విక్రయాలు జరుపుతున్న నీలిషికార్లు రాజమ్మ, రోజా, భారతిలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. విచారణలో భాగంగా నాటుసారా తయారీకి ఉపయోగించిన బెల్లం ఎక్కడ కొనుగోలు చేశారనే విషయంపై విచారణ జరపగా నందికొట్కూరుకు చెందిన నారాయణ వద్ద కొనుగోలు చేసినట్లు తేలడంతో ఆయనపై కూడా కేసు నమోదు చేశారు. అలాగే ఓర్వకల్లుకు చెందిన శారద వద్ద 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ వెల్లడించారు. నిరంతరం దాడులు చేస్తున్నప్పటికీ సారా తయారీ, రవాణా, విక్రయదారులు తమ వృత్తిని మానుకోవడం లేదని, పదేపదే ఎక్సైజ్ నేరాలకు పాల్పడుతున్న వారిపై ఇకపై పీడీ కేసులు నమోదు చేసి జైలుకు పంపనున్నట్లు సీఐ తెలిపారు.

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోండి



నన్నూరులో దండోర వేయిస్తున్న డీఈఓ శామ్యూల్ పాల్

ఓర్వకల్లు: 10వ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులు వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ పాల్ అన్నారు. శనివారం మండలంలోని నన్నూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. మండల వ్యాప్తంగా ఎంత మంది విద్యార్థులు 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించారు.. ఫెయిల్ ఎంత మంది అయ్యారు తదితర వివరాలపై మండల విద్యాశాఖ అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు 10వ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నేటి నుంచి ఈ నెల 18 వరకు ఉచిత వేసవి శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు జరుగుతాయన్నారు. శిక్షణ సమయంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఓంకార్ యాదవ్, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మద్దిలేటి, ఉపాధ్యాయులు గౌరీనందరెడ్డి, సీఆర్‌పీలు, పాఠశాల సిబ్బంది రమణ, కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. హైవే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. భూపనపాడు గ్రామానికి చెందిన చాకలి మాసుం, కొణిదేడు గ్రామానికి చెందిన చాకలి ఎల్లసుబ్బుడు ద్విచక్ర వాహనంపై పాణ్యంకు వస్తున్నారు. మార్గ మధ్యంలో సుగాలి మెట్ట వద్ద గుర్తు తెలియని ట్రాక్టర్ వారి బైక్‌ను ఢీకొట్టి వెళ్లింది. ఈ ఘటనలో గాయపడటంతో స్థానికులు చికిత్స నిమిత్తం పాణ్యంకు తరలించారు. బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్ కోసం గాలిస్తున్నట్లు హైవే పోలీసులు తెలిపారు.

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జిల్లా జడ్జి కోర్టులో..
E.A.No. 316/2024 in E.P.No. 61/2013 in O.S.No. 97/2012

బి.దేవశంకరయ్య ఉరఫ్ బాబు ..అర్జీదారుడు/డిక్రి హోల్డర్

-Vs-

1.డి.ఎం.సుభాన్ పోతి వారసులు,
2.డి.గోరిబి, 3.షేక్ షావలి,
4.షమీర్, 5.హసీనబీ ..రెస్పాండెంట్లు/J.Dr's

2 నుండి 5 రెస్పాండెంట్‌లకు Section-50 C.P.C మరియు రూల్ 28 సివిల్ రూల్స్ ఆఫ్ ప్రాక్టీస్ ప్రకారం నోటీసు

(R2) డి.గోరీబీ భర్త లేట్ డి.ఎం.సుభాన్
(R3) షేక్‌షావలి తండ్రి లేట్ డి.ఎం.సుభాన్
(R4) షమీర్ తండ్రి లేట్ డి.ఎం.సుభాన్
(R5) హసీనాబీ తండ్రి లేట్ డి.ఎం.సుభాన్

అందరూ ఇంటి నెం:4-160, గూడూరు గ్రామం మరియు మండలం, కర్నూలు జిల్లా.

పై నంబర్ E.P లో డి.ఎం.సుభాన్ చనిపోయినందున అతనికి పైన కనబడిన రెస్పాండెంట్‌లను వారసులుగా చేర్చమని అర్జీదారుడు అర్జీ దాఖలు చేసినారు. ఇందులో 1 నుండి 4 రెస్పాండెంట్‌లు (2 నుండి 5 J.Dr's) అయిన మీకు అక్షేపణ వున్న తేది: 26.6.25వ తేదిన పగలు 10:30 గంIIలకు పై కోర్టుకు హాజరై తెలుపవలెను. లేని యెడల పరోక్షముగా తీర్మానించబడును.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

బి.క్రిష్ణమూర్తి
అర్జీదారు పరం అడ్వకేటు, కర్నూలు
సెల్: 94407 70483

బాబు బడాయికి రాష్ట్రం బలి

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ ధ్వజం



కర్నూలు (టౌన్) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బడాయికి రాష్ట్రం బలి అవుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ విమర్శించారు. శనివారం స్థానిక సి. క్యాంపులోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కోట్లాది ప్రజల కడుపు కొట్టి లక్షల కోట్ల సంపదనంతా అమరావతి రాజధాని అభివృద్ధి పేరుతో దుబారా చేస్తున్నారన్నారు. పెత్తందారులకు మేలు చేసేందుకే సీఎం అమరావతిని నిర్మిస్తున్నారన్నారు. తన నివాసం కోసం 5 ఎకరాల్లో ఇల్లు కట్టుకుంటున్న బాబు అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్న పేదలకు ఒక గూడు కట్ట లేదన్నారు. రూ. వేల కోట్లు ఖర్చు చేసి గతంలో కట్టిన అసెంబ్లీ, సెక్రటేరియట్, హైకోర్టు తదితర భవనాలు ఉండగా ఇప్పుడు రూ. లక్షల కోట్లు అంచనాలు వేసి మళ్లీ అవే భవనాలు కట్టాలని నిర్ణయించడం సర్కారు బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమని మండిపడ్డారు. రాష్ట్ర సంపదనంతా ఒకే చోట కేంద్రీకరించడం సరికాదన్నారు. మిగతా జిల్లాల అభివృద్ధిని కూడా పట్టించుకోవాలని లేకపోతే ప్రజలు తిరుగుబాటు చేస్తారని హెచ్చరించారు.

పెద్దాసుపత్రికి 30 పడకల విరాళం



నూతన పడకలను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, హెల్త్ వర్సిటీ వీసీ డాక్టర్ పి. చంద్రశేఖర్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కార్డియాలజీ విభాగానికి విజయ హాస్పిటల్ అధినేత డాక్టర్ టి.విజయకృష్ణారెడ్డి రూ.10 లక్షల విలువైన 30 అధునాతన పడకలను విరాళంగా అందజేశారు. ఆయన తన తండ్రి, కార్డియాలజి విభాగం పూర్వ హెచ్‌ఓడి డాక్టర్ టి. రామకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం ఈ పడకలను జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ చేతుల మీదుగా శనివారం ప్రారంభించారు. పేస్‌మేకర్స్ వేయించుకున్న రోగులు, గుండె చికిత్స చేయించుకుంటున్న వారిని జిల్లా కలెక్టర్ పరామర్శించారు. కార్యక్రమంలో ఇటీవల యూనివర్సిటి టాపర్‌గా నిలిచిన కార్డియాలజి పీజీ డాక్టర్ మహేష్‌కు డాక్టర్ టి. రామకృష్ణారెడ్డి గోల్డ్‌మెడల్ బహూకరించారు. ప్రతి సంవత్సరం తన తండ్రి పేరిట ఉత్తమ విద్యార్థికి గోల్డ్‌మెడల్ అందజేయనున్నట్లు ఆయన ప్రకటించారు. కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మ, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.